మనో మనసూ

యర్రంశెట్టి శాయి

భానుమతీ, కాదంబరీ ఇద్దరూ ఒకప్పుడు ఒకటిగానే ఉండేవారు. కాని ఇప్పుడు కాదు. యస్సస్సల్సీ చదువుతోండగా ఇద్దరకూ ఓ చిన్న విషయంమీద అభిప్రాయ భేదాలొచ్చి కాంగ్రెసు పార్టీలా చీలిపోయారు. భానుమతిదే తప్పని కాదంబరి ఎలిగేషన్స్ చేసింది. కాదు, కాదంబరిదే తప్పని భానుమతి కౌంటర్ ఎలిగేషన్స్ లేవతీసింది. దాంతో ఇద్దరికీ సంబంధాలు మరింతగా చెడిపోయినయి. ఒకటిగా ఉన్నప్పుడు తెలుసుకొన్న కొన్ని కాదంబరి రహస్యాలను భానుమతి బయట పెట్టింది. భానుమతి తాలూకు కొన్ని అమర్యాదకరమయిన విషయాలు కాదంబరి బయటపెట్టింది. కాని కాదంబరి కప్పుడు "పేదవాని కోపం పెదవికి చేటనే" సామెత తెలీదు, కనీసం ఎవ్వరూ చెప్పగా కూడా విన్లేదు. ఆమెకా సామెత తెలీపోతే అందుకు గొప్పింటి పడుచయిన భానుమతి బాధ్యురాలు కాదు

* *

సత్తిరాజు సచ్ఛరిత్రుడు. నోట్లో వేలెట్టినా కొరకలేనంతటి మంచివాడు. ఎదురుగా 'శాండ్రాడీ' స్విమ్మింగ్ డ్రస్‌తో నుంచున్నా కన్నెత్తి చూడనంతటి శీలసంపన్నుడు. అలా అని అతన్జదివిన హైస్కూలు హెడ్మాష్టరుగారి 'సర్టిఫికేట్' ఉంది. అలాంటిదే ఆ పేట నుంచీ కౌన్సిలర్‌గా ఎన్నికయి ఛైర్మన్ గిరీ వెలిగిస్తోన్న సీతాపతిగారి అభిప్రాయముంది. అంచేత అతనికి ఆ పేటలో పరువుంది. అవధాన్లుగారి వాత్సల్యముంది. ఆయన భార్య ప్రజావతమ్మగారి ఆదరణ వుంది. అతనంటే ఆవిడ కూతురు కాదంబరి గుండెల్లో కల్తీలేని ప్రేమ ఉంది.

సత్తిరాజు చాలామందిలానే బీదాడు. అంచేత అతని పెదాలపయి ఎప్పుడూ

చిరునవ్వు చిందులాడుతూంటుంది. అతనికి తండ్రి లేడు. అంచేత అతని చూపుల్లో దైన్యం తొంగిచూస్తుంటుంది. అతనికి తెలివుంది. అంచేతే బి. ఏ. సెకండ్ క్లాస్‌లో పాసయేడు. అతనికి రికమండేషన్ లేదు. అంచేతే అతనికేదీ ఉద్యోగం దొరకలేదు.

బి. ఏ. చదివేప్పుడు గోపాలం సత్తిరాజు క్లాసుమేటు. స్వంత గుఱ్ఱబ్బండీలో కాలేజికొచ్చే రెండు జెడల డాక్టరుగారమ్మాయి (రెండు జడలు డాక్టరుగారివి కాదు, వారి అమ్మాయివి) భానుమతికూడా అతని క్లాస్‌మేటే. అతని తెలివితేటలు చూసి ఆశ్చర్యపోయిన కొంతమంది వాళ్ళ క్లాసమ్మాయిలలో భానుమతికూడా ఉంది. అతని మొఖం చూసి 'చక్కనివాడే' అని అనుకొన్న ఆ కాలేజీ ఆడపిల్లల్లో భానుమతి ఒకర్తె. కానీ, మిగతావాళ్ళల్లా ఆమె అక్కడితో ఊరుకుండిపోలేదు, కొంచెం ధైర్యం తెచ్చుకొంది దానికి చనువు కలుపుకొంది. వీటి నుపయోగించుకొని ఓ సంవత్సరం తను కాలేజి ఎంటర్‌టెయిన్‌మెంట్ సెక్రటరీగా పోటీ చేసినప్పుడు అతనితో పరిచయం సంపాదించుకొంది

"మీరు నా తరపున కాన్వాస్ చేస్తానంటేనే, నేన్నుంచుంటాను. అసలు మీరు సపోర్ట్ చేస్తారనే నేనుంచుంట. లేపోతే నాకంత ధైర్యం ఎక్కడిదనీ?" అంటూ తనే ధైర్యంగా మాట్లాడింది.

తనంటే అంత గొప్ప. 'మన' అనే అభిప్రాయం ఆ అమ్మాయి కెలా కల్గిందా అని ఓ నిమషం ఆలోచించాడు గానీ, సత్తిరాజు కది రైల్వే ఇంగ్లీషులా గందరగోళంగా అనిపించేసరికి ఆలోచించడం మానుకొన్నాడు.

ఆ తరువాత ఓరోజు తమ క్లాసులోని ఇందిర, లక్ష్మి, మైథిలి, గోపాలం, ప్రసాదరావుల్తోపాటు భానుమతి వెంబడి కాన్వాసింగ్‌కి తిరుగక తప్పలే దతనికి. భానుమతి ఈ అవకాశాన్ని మన వియత్నాం పాలసీలా ఎంతో తెలివిగా ఉపయోగించుకొంది. ఎలక్షన్ సంగతొదిలేసి మిగతా విషయాలు బోలె డతన్తో మాట్లాడింది. మీరు ఇంగ్లీష్ పిక్చర్లెవరి వెక్కువ చూస్తారంది. మీకు నచ్చే హీరో హీరోయిన్లెవరని అడిగింది.

"రాక్ హడ్సన్, క్లాడియా కార్డినల్" అని అతజ్జవాబిస్తే "అరె! నాకూ వాళ్ళంటేనే ఇష్టం!" అంది ఆశ్చర్యంగా. అంటూనే అతనిగురించి వివరాలు సేకరించింది.

"పాపం! మీ తండ్రి ఆ మధ్యన పోయారని విన్నాను!" అంది జాలిగా.

మిగతా కథ సత్తిరాజు చెప్పేశాడు. అప్పటికే బోలెడుకష్టా లనుభవించేసిన తన తల్లిపై బీదతనం నీడ పడనీకుండా మిగతా జీవితం గడపాలనుందని వివరించేడు. అతని పరిస్థితులు చూసి ఆమె ముచ్చటపడింది. అలాంటి పరిస్థితులంటే

ఇష్టపడికాదు ముచ్చటపడక! ఆ పరిస్థితులు తన స్వార్థానికి అనుగుణ్యంగా ఉన్నాయనే. ఆ సంవత్సరాంతం లోపలే అతనితో నాలుగయిదుసార్లు మాట్లాడే సందర్భాలు కల్పించుకొంది.

రిజల్ట్స్ వచ్చేశాయి. సత్తిరాజు సెకండ్ క్లాసులో పాసయేడు. భానుమతికి ఓ పార్టు మిగిలిపోయింది. గోపాలం మామూలుగానే కాపీలు కొట్టేసి పాసయిపోయేడు.

విదేశ సహాయంమీద ఆశలా, దొరక్కపోయినా ఉద్యోగంమీద ఆశ చావదు కొందరికి. వెదుకుతోనే ఉంటారు సత్తిరాజు బి. ఏ. పాసయిన మర్నాటినుంచీ అలా వెదుకుతోనే ఉన్నాడు. పగలు భూతద్దం వేసుకొనీ, రాత్రిళ్ళు 'త్రీసెల్స్' టార్చిలైట్ వేసుకునీ మరీ వెతుకుతున్నాడు. అయినా చాలామందిలానే అతనికీ ఏ ఉద్యోగమూ దొరకలేదు. అతనిమీద ఆప్యాయతకొద్దీ అతనింటికి రెండిళ్ళవతల ఉండే ప్రజావతమ్మగారు అతనికో ఉద్యోగం వేయించాలని ఉబలాటపడింది. ప్రజావతమ్మ ప్రజల మనిషి. స్వాతంత్ర్య పోరాటంలో వాళ్ళ ఊళ్ళో ముందంజవేసిన మొదటి స్త్రీ ఆమె. కొన్నాళ్ళు జైల్లోకూడా ఉంది. ఆ ఊళ్ళో ఉప్పు సత్యాగ్రహం ఆవిడ ఆధ్వర్యంలోనే ప్రారంభమయింది. విదేశ వస్తు బహిష్కరణోద్యమంలో ఆవిడే ముందస్తుగా తనకు శ్రీవారు బహూకరించిన ఓ సిల్కు చీరను తగలెట్టేసింది. స్వాతంత్ర్యం లభించిం తర్వాత పూలదండ లేసుకొని ఊరేగిన అనేకమంది ప్రముఖుల్లో ఆమె కూడా ఉంది.

స్వాతంత్ర్యం వచ్చింతర్వాత దాని కోసం పోట్లాడిన కొంతమందికి తరువాతేంజేయాలో అర్థం కాలేదు. ఉన్న ఉద్యోగం ఊడిపోయినట్లనిపించింది. చివరకు దానంత పట్టుదలా, టీమ్‌వర్కూ, సరదాలూ ఇవన్నీ ఎలక్షన్ ఫీల్డులో దొరికేట్లు కనిపించినయి. వెంటనే అందరూ తలో పార్టీ స్థాపించేసుకొని రంగంలోకి దూకేశారు. ప్రజావతమ్మగారు తనూ దూకుతానంది గానీ, అవధాన్లుగారు వప్పుకోలేదు. "నీ కసలే కాళ్ళు నొప్పులంటున్నావు గదా, మళ్ళీ అందులో ఇందులో దూకడమెందుకూ? హాయిగా కూచుని రెస్ట్ తీసుకోక?'' అని కోప్పడ్డారు. దాంతో ఆవిడ తన రాజకీయ జీవితమంతా తెలుగుసినిమా ఇంటర్వెల్ తర్వాత, దానిముందు కథ మర్చిపోయిన ప్రేక్షకునిలా మర్చిపోయింది. వంటింట్లో ఉల్లిపాయ ల్తరుగుతూ అన్నాళ్ళూ అలక్ష్యం చేసిన తన భర్తకూ, కూతురికీ వంట చేస్తూ శేషజీవితం గడిపెయ్యాలని నిర్ణయించుకొందామె.

అవధాన్లుగారు తను పనిచేస్తున్న ఓ ప్రైవేట్ కంపెనీ అర్జంటుగా దివాళా తీసింతర్వాత జరిగినంతకాలం అప్పుజేసి దర్జాగా గడిపారు. తర్వాత ఉన్న ఇల్లు

'కాదంబరి తనదయితే ఎంత బావుండు' ననుకొన్న సత్తిరాజొక్కడే అవధాన్లుగారి సమాజంలో చేరేడు. అతని సంస్కారాన్నీ, మంచితనాన్నీ అవధాన్లు గారూ, ఆయన్తోబాటు ప్రజావతమ్మగారు ముచ్చటించుకొంటూంటే విని 'కాబోలు' ననుకొంది కాదంబరి. అప్పుడప్పుడు ఏదో పనిమీద ఇంటికొచ్చి తనతో మాట్లాడ్డం మొదలెట్టాక "కాబోల్నేవిటీ! సెంట్ పర్సెంట్ సంస్కారుడు ఇట్టి సజ్జనుని పొందు స్త్రీ ఎంత అదృష్టవంతురాలో గదా!" అని బెంగపడింది. అప్పుడే ఓ మెరుపు తళుక్కున ఆమె హృదయంలో మెరిసింది "నాకంత అదృష్టమా?" అని ప్రశ్నించుకొంది లోలోపల. ఏ గైడ్‌లో దొరుకుతుందని దీనికి సమాధానం! (ఎచ్చటా దొరకదని భావము). అంచేత జవాబు సత్తిరాజునే పబ్లిక్ పరీక్షకు చదివినట్లు క్షుణ్ణంగా చదివి తెలుసుకోవాలనుకొంది. అప్పట్నుంచీ సత్తిరాజు కనబడితే ఆమె గుండెల్లో జ్యోతులు వెలుగుతున్నాయి. అతను మాట్లాడితే ఆమెలోనుంచి విపరీతమయిన చలి పుట్టుకొస్తోంది. అతను తనను చూసి నవ్వితే జీతం పెరిగిన (ధరలు పెరగకుండా) సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీలా మురిసిపోతోంది. ఆ రాత్రంతా ఆమెకు తెలుగు సినిమాలో హీరోయిన్లా రెండు మూడు తియ్యని కలలొస్తున్నాయి.

కాదంబరి అతనికి కాఫీ ఇచ్చింది. ఇచ్చేప్పుడు ఆమె చెయ్యి సిగ్గుతో వేగంగా వణికింది. కాఫీ కొద్దిగా ఆమె

అమ్మిపారేసి సత్తిరాజు ఇంటిదగ్గర కారు చవకలో ఓ భవనంలాంటి పాడుపడిన పెంకుటిల్లు అద్దెకు తీసుకొన్నారు. సత్తిరాజు ఆయన కంతకుముందే తెలుసు. ఓ ఉదయం లేచి మంచి నీళ్ళయినా అడక్కుండా, కాఫీ అడిగి త్రాక్కుండా, హార్టెటాక్‌తో పైకెళ్ళిపోయిన సత్తిరాజు తండ్రి ఆయనకు కోవర్కర్. ఆయన ఈ పెంకుటింట్లో దిగింతర్వాత సత్తిరాజు ఆ కుటుంబానికంతకూ ఆప్తుడయిపోయాడు. సత్తిరాజు ఉద్యోగం కోసం కంట్రోల్ లేని బియ్యం కోసం తిరిగినట్లు తిరుగుతూంటే ప్రజావతమ్మగారు తన జాలిగుండెతో జాలిపడింది. ఆరోజు అతను మామూలు ప్రకారం ఉద్యోగం కోసమని పోబోతూంటే "ఇట్రామ్మా సత్తీ!" అంటూ పిలిచింది. సత్తిరాజు లోపలికొచ్చేడు. బహుశా ఆవిడ తను పాల్గొన్న మరో స్వాతంత్ర్య సమరగాధ వినిపించడానికే పిలిచుంటుందనుకొని, వినడానికి చెవులు రిక్కించుకొని మరీ వచ్చాడు. అయితే ఆవిడ ఎంతసేపటికీ వినిపించకపోయేసరికి ఆశ్చర్యంగా లోపలికి చూశాడు. చూసి మరీ తెగ ఆశ్చర్యపోయాడు. కాదంబరి కప్పునిండా కాఫీ తీసుకొని, ఓ చుక్క కూడా క్రింద సాసర్లోకి చిలక్కుండా అతి జాగ్రత్తగా వస్తోంది. ఆ అమ్మాయి నలా చూస్తోంటే అతనికి పెళ్ళి చూపుల సీను గుర్తొచ్చి చిన్నగా నవ్వుకొన్నాడు. అతను నవ్వుకోడం ఓరకంట గమనించిన కాదంబరి గుండెలు ఝల్లుమన్నాయి. సిగ్గుతో చచ్చిపోయింది (నిజంగా కాదు) అడుగు ముందుకీ వెనక్కూ కూడా పడలేదు. అక్కడే ఆగిపోయింది ఆడదాని వయసులా.

కాదంబరి యస్సెల్సీ చదివింది. పాసయింది. ఆ తరువాత కూడా చదువుతానందికాని వాళ్ళ నాన్న ఒప్పుకోలేదు. "చదివి చేసేదేముంది? అడుక్కుతింటమే గదా! ఆపని చాలమంది చేస్తున్నారు. ఇక నువ్వు కూడా ఎందుకూ?" అని కోప్పడేసి. ఉత్తరీయం పైనేసుకొని, అరగని చెప్పులేసుకొని సంబంధాలు వెతకడానికి బయల్దేరారు.

కాదంబరి అందంగా ఉంటుంది. కాని అలా అన్జెప్పి ఆమెని ఒక్కసారి చూసిన వాళ్ళెవ్వరూ ఒప్పుకోరు. ఆమె అందం 'ట్రిబులెక్స్' రమ్ లాంటిది, త్రాగినకొద్దీ నిషా ఎక్కినట్లే. చూసినకొద్దీ ఇనుమడిస్తుందామె అందం.

అవధాన్లుగారు తమ స్థితికి సరిపడే సంబంధంకోసం వెతికి, వెతికి అలాంటిది, తనివ్వగల ధరలో బ్లాకులో కూడా దొరకదని తెలుసుకొని ఆంధ్రదేశం మీద వళ్ళుమండి 'వరకట్న నిషేధ సమాజం' అని ఓ సంస్థ స్థాపించి ప్రస్తుత అది ఏరోజు కారోజు లిక్విడేట్ కాకుండా కాపాడుకొస్తున్నారు. ఆ సమాజం స్థాపించి సంవత్సరమయిపోయినా కాదంబరి మాత్రం అలానే ఉండిపోయింది.

చేతిమీద వలికింది. మరి కొంచెం సత్తి రాజు చేతిమీద పడింది. ఆమె అందరికీ లోకువయిన అసిస్టెంట్ స్టేషన్ మాస్ట రులా, తప్పుచేసినట్లు తలవంచేసుకొంది.

"మరేం ఫర్వాలేదు!" అంటూ నవ్వే శాడు సత్తిరాజు.

ఈలోగా ప్రజావతమ్మగారు హాల్లోకి వచ్చేసింది.

"అవునూ! ఇంకా ఉద్యోగం దొరక లేదూ?"

"ఊహూ! లేదండీ! 'మనీ, హనీ' అని ఈ రెండిట్లో ఏదొహటి ఉంటేనే గాని ఉద్యోగం దొరకదండీ!" నిస్పృ హగా జవాబిచ్చేడతను.

"పిచ్చాడా?" అంది ప్రజావతమ్మ నవ్వేసి.

సత్తిరాజుకి ఈ కొటేషన్ అర్థం కాలేదు. తెలుగు సిన్మాలు చూస్తే అర్ధ వయిపోయేదే గాని అతనవి చూడడు (అంచేత అతని కర్మ కతనే బాధ్యుడు).

"రికమండేషన్ కావాలంటే చెప్పు! ఇప్పుడు మినిష్టర్లూ, ఎంపీలూ ఎవరను కొన్నావ్? స్వాతంత్రోద్యమంలో నాతో పాటు జైల్లో ఉన్నాళ్ళేగా? నా 'మనిషి'కి ఆ మాత్రం ఉద్యోగం వేయించలేరూ?"

సత్తిరాజుకి ఆపరాని నవ్వొచ్చింది. మామూలు నవ్వయితే నవ్వడం బావోదని ఆపేసేవాడే గాని ఆపరాని నవ్వని తెలిసి పోవడంవల్ల పకపక నవ్వేశాడు. మధ్య మధ్య ఈ డైలాగులు ఇరికించాడు "అ....ల్లే...వారండీ! పెద్దపెద్ద పద వుల్లో ఉన్న చాలామందికి 'స్వాతంత్రోద్యమం'కి స్పెల్లింగ్ తెలియదండీ బాబూ!"

ప్రజావతమ్మగారికి కోపం వచ్చింది. సత్తిరాజది గ్రహించి నవ్వాపేశేడుగాని ఆగలేదు. కాదు .. అతనాపేశాడు కాని అతన్తోపాటుగా నవ్వేస్తున్న కాదంబరి మాత్రం ఇంకా నవ్వుతోనే ఉంది.

ఇజ్జరిగిన నెల్రోజుల తర్వాత ఓ వెన్నెల రాత్రి కాదంబరి వాళ్ళ పెరట్లోని జామచెట్టు క్రింద సత్తిరాజు కౌగిట్లో మత్తుగా ఒరిగింది కాదంబరి. దీని కంతకూ ప్రోత్సాహం కేవలం కాదంబరిదే.

"మీరు తప్పకుండా పెళ్ళి చేసుకొం టారుగదూ నన్ను" అడిగిందామె సత్తి రాజుని.

"ఓ! తప్పకుండా! ఇంతకూ మీ వాళ్ళు వప్పుకొంటారా?" సందేహంగా అన్నాడతను.

"వప్పుకోకేంజేస్తారేం? అమ్మ తమా పెట్టదు, అడుక్కు తినానివ్వదట. నా యిష్టం! వాళ్ళొప్పుకోపోయినా సరే మీతో వచ్చేస్తాను ..."

"బావుంది. పోనీ అలాగే అనుకొన్నా నాకింకా ఉద్యోగం దొరకాలికదా! అందాకా ఓపిక పట్టాలి మనం ..."

కాదంబరికి ఓపిక ఎప్పుడో హరించి పోయింది. ఓ వేళ హరించకపోయినా ఓపికపట్టటం ఆమెకు నవేమిరా ఇష్టం

లేదు. ఆమెకు దేశ జనాభాలా పెరిగి పోతున్న తన వయసు తెలుసు. ఏవయసు ముచ్చటావయసులో నన్న సంగతెలుసు. తనతోటి వయసు వాళ్ళనుభవిస్తున్న ముచ్చటలు తెలుసు. తన తల్లిదండ్రుల శక్తిసామర్థ్యాలు ఎప్పుడో తెలుసు. ఇలాగే ఉంటే తన భవిష్యత్తు ఏమవుతుందో కూడా తెలుసు. అన్నీ తెలుసు. అంచేతే ఆ మాటే సత్తిరాజుతో అంది.

"ఉద్యోగం రాపోతేనేం? తిండి దొర కదు? అంతేగా? ఫర్లేదు. నాకు మీరుంటే చాలు. ఇంకేమీ అఖ్ఖర్లేదు. ఏమీలేపోయినా ఫర్లేదు. ముందు నన్ను మీదాన్ని చేసుకోండి .."

ఆమెను సముదాయించి, నచ్చజెప్పే సరికి తెల్లారుజామున నాలుగయింది సత్తిరాజుకి.

మరో ఆరు నెలలు మధ్యతరగతివాడి పాలిట కరువురోజుల్లా చాలా కష్టంగా గడిచినయి సత్తిరాజుకి. ఏ ఉద్యోగవూ

దొరకదనే విస్పృహ, నిరాశ, 'ఫ్లూ' జ్వరంలా అతన్నావరించేసుకొన్నాయి. తల్లి ఓ సరికొత్త (డాక్టర్లు డయాగ్నైజ్ చెయ్యలేని) జబ్బుతో మంచం పట్టేసరికి అతని పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారయింది. గోపాలం వరల్డ్‌బాంకు ఎప్పుడూ అప్పు అడిగే చిన్న దేశాలను విసుక్కుంటున్నట్లు "ఎన్నాళ్ళనిరా? ఏదో ఉద్యోగంలో ఇరుక్కోరాదూ?" అంటూ సత్తిరాజు మీద విసుక్కుంటున్నాడు అప్పు అడిగినప్పుడల్లా.

ఓరోజతను అవధాన్లుగారితో కాసేపు మాట్లాడి వాళ్ళింట్లోంచి బయటికొచ్చేసరికి ఎదురుగ్గా ఓకారు వచ్చి ఆగింది.

"హల్లో రాజూ?" అంటూ అందులోనుంచి భానుమతి గొంతు వినిపించిందతనికి. సత్తిరాజు కారు దగ్గరగా నడిచాడు. లోపల భానుమతే కాక ఓ డాక్టరుగారు కూడా ఉన్నారు.

"మా డాడీ!" అంది భానుమతి.

"నమస్తే!" అన్నాడు సత్తిరాజు.

"నీగురించి అమ్మాయి చెప్పింది!" అన్నాడాయన నవ్వుతూ. ఆయన్నవ్వు ఇంగ్లీష్ క్రైమ్ పిక్చర్లోని బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లా ఉంది.

"ఇదేనా మీ ఇల్లు?" ఇంటివంక చూస్తూ అడిగి, ఆశ్చర్యంగా ఆయింటి వంకే చూస్తుండి పోయింది. ఓక్షణమాగి చటుక్కున తల లోపలకు త్రిప్పుకొంది. అరుగుమీది కాదంబరి విసురుగా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"ఉబ్బే! ఇది అవధాన్లుగారని ఆయనిల్లు మాది ఇంకా అవతల"

"ఎక్కడయినా జాబ్ చేస్తున్నావా?" అడిగారు డాక్టరుగారు.

"లేదండీ! బహుశా అది చేసే యోగ్యత నారాతలో లేదనుకొంటాను!"

"దొరక్కెక్కడికి పోతుందోయ్ ట్రై అండ్ ట్రై అన్నారు. అవ్సరే మా యింటికోసారి రావోయ్! తీరిగ్గా మాట్లాడుకుందాం! ఏం?"

కారు వెళ్ళిపోయింది. భానుమతి కాదంబరి ఇంటివంకే చూస్తూ సత్తిరాజుకి రుమాలు ఊపింది.

ఇజ్జరిగిన వారం రోజుల్తరువాత డాక్టరుగారి కారు ఓ ఉదయం అదృష్టంలా వచ్చి సత్తిరాజింటి ముందాగింది. "డాక్టరుగారు మిమ్మల్దీసుకు రమ్మన్నారు" అన్నాడు డ్రైవరు. సత్తిరాజు కారెక్కాడు. అతను తనింటికి తిరిగొచ్చేసరికి సాయంత్రం అరయింది. రావడంతోనే తన కుక్కిమంచం పెరట్లోని బాదంచెట్టు క్రిందేసుకొని అందులో వాలిపోయాడు. అతనికి కాటుక కళ్ళతో తనవేపు దీనంగా చూస్తున్న కాదంబరే కనబడుతోంది ఆ పిల్లచూపులో అవ్యక్తమయిన ప్రేమ ఉంది. ఆ పిల్ల తనతో మాటాడే మాటల్లో వెచ్చదనం ఉంది ఆ పిల్ల తనకిచ్చే కాఫీలో అమృతం ఉంది (పంచదార ఎక్కువయ్యేం కాదు) తన గుండెల్లో కొంత భాగాన్ని ఆ పిల్ల ఆక్రమించుకొని ఉంది పూర్తిగుండెంతా ఆ పిల్లనే నింపాలన్న కోరిక ఉంది. అందుకు అవకాశవూ ఉంది.

కాని ఆపిల్ల న్జేసుకొంటే చన్నీళ్ళకు చన్నీళ్ళే తోడవుతాయి. ఉన్న కష్టాలకు మరికొన్ని సమస్యలు కూడు కొంటయి.

భానుమతి న్జేసుకొంటే డాక్టరుగా కన్నట్లు తనకి 'ఫ్యూచర్' వస్తుంది. 'పొజిషన్' వస్తుంది సుఖం వస్తుంది. అంచేత తల్లి సుఖపడుతుంది.

"ఏవిటండీ! ఇల్లంతా వదిలి ఇక్కడిలా వంటరిగా " అంటూ వచ్చింది భానుమతి ప్రిస్టేజ్ సీటు గెల్చిన అభ్యర్ధి పడేంత సంతోషం సత్తిరాజుని గెల్చుకోటంచేత. ఆమె మొఖంలో వెలుగుతోంది. అదే ఆనందంతో ఆమె కళ్ళు ఫిజిక్స్ లాబ్‌లోని పాదరసంలా మెరుస్తున్నయి. జడ్జీగారి ముద్దుల చిన్నపాపలా అప్పుడే నడవడం నేర్చుకొంటున్నట్లు ఆమె అడుగులు తడబడుతున్నయి

"ఊఁ హుఁ ..ఏవీ లేదు ఊరికెనే!" ఖంగారుపడ్డాడతను.

మొదటిసారిగా ఓడిపోయాడు తను ఐశ్వర్యానికీ, పేదతనానికీ. తన హృదయంలో జరిగిన బై ఎలక్షన్లో పేదతనానికి డిపాజిట్ గల్లంతయింది. తన హృదయాన్ని 'పబ్లిక్ ఆక్షన్' లో కారుచవగ్గా, ఏమాత్రం వాల్యూలేని వస్తువులా అమ్మేశాడు.

"ఏమిటో దాస్తున్నారు మీరు! అతని కళ్ళల్లోకి ముద్దాయిని క్రాసెగ్జామిన్ చేసే లాయరులా చూసిందామె

నవ్వులాంటి దొహటి సత్తిరాజు పెదాలమీద ట్యూబ్‌లైట్లా వెలిగింది.

బెజవాడ గుంటూరు రోడ్‌మీద లారీల్లా కొన్ని సంవత్సరాలు ఎక్స్‌ప్రెస్ స్పీడులో గడిచినయి.

అనాధస్త్రీ శరణాలయం ఎక్స్‌టెన్షన్ వింగ్‌కి కలెక్టరుగారు ప్రారంభోత్సవం చేశారు బాలామంది ప్రముఖులు ఆ ఫంక్షన్‌కి హాజరయ్యేరు. కలెక్టర్‌గారు అలాంటి శరణాలయాల ఆవశ్యకతను గురించి గంభీరంగా ప్రసంగించారు. ప్రభుత్వంవారి గ్రాంటు లభించేట్లు చేయడానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తానని వాగ్దానం చేశారు.

ఆరాత్రి కలెక్టర్‌గారు శరణాలయానికి కొద్దిదూరంలో ఉన్న రహదారి బంగళాలో ఆగారు. భోజనం చేశేక చాలాసేపు ఆయనకు నిద్రపట్టలేదు గడచిన జీవితం ఆయన కళ్ళముందు మెదిలి ఆయన మనసుని చికాకు పరచింది. సత్తిరాజు బి.ఏ. (అనెంప్లాయిడ్) అల్లా ఎస్. రాజు, ఐ.ఏ.యస్ గా తనెలా మారిపోయిందీ గుర్తొచ్చింది. దాంతోపాటే కాటుక కళ్ళ నిండా కన్నీటితో కాదంబరి గుర్తొచ్చింది ఆమెతో గడిపిన వెన్నెల రాత్రుళ్ళు గుర్తుకొచ్చినయి. ఆమెకు తను చేసిన వాగ్దానాలు, ఆమె గుండెల్లోని ఆశలూ, కోర్కెలూ అన్నీ గుర్తొచ్చినయి. దాంతో ఆయన గుండె బరువెక్కింది. రాత్రి పదయింది. గది తలుపు మెల్లగా తెరచుకొంది. అందంగా అలంకరించుకొన్న ఓ అమ్మాయి లోపలికి వచ్చింది సత్తిరాజు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు

''నువ్వా!'' అన్నాడు కాదంబరివంక ఆశ్చర్యంగా చూస్తూ.

''అవును. ఎందు కాశ్చర్యపోతున్నారు? .'' అందామె అతనివంక చూడకుండా.

'కాని నువ్వు ఇప్పుడిక్కడ ఎలా వచ్చావ్!'

''మామూలుగానే. మీ కిది క్రొత్తేమో! నా కలవాటే. ఎవరయినా పెద్దవాళ్ళు వచ్చినప్పుడు శరణాలయంనుంచి నన్నే పంపిస్తూంటారు. మిగతావాళ్ళందరినీ మా మానేజరే ఎక్కడెక్కడికో తీసుకెళ్తూంటాడు. మా అనాధస్త్రీల మూలాన ఆయనకెంతలేదన్నా రోజుకి వందరూపాయలు గిడుతూంటుంది. ఈ రాత్రికి నా శరీరం మీద సర్వహక్కులూ మీ కిచ్చారు మా మేనేజరుగారు. తీసుకోండి!''

సత్తిరాజు నిర్విణ్ణుడయాడు. ''కాదంబరీ ఏమిటి మాట్లాడుతున్నావ్ నువ్వు!''

''నువ్విక్కడ ఎందుకు చేరావ్? అమ్మా నాన్నా ఏమయ్యారు? '' వణుకుతోన్న గొంతుకతో అడిగాడతను.

''నాన్న చనిపోయారు. అమ్మకు పిచ్చి ఎక్కింది. ఎక్కడకు పోయిందో తెలీదు. నీ పుణ్యాత్ముడు కన్నెచెర వదిలించి పుణ్యం కట్టుకొన్నాడు. మరో పుణ్యాత్ముడు నన్నిక్కడ చేర్పించాడు. తరువాత బోలెడుమంది పుణ్యాత్ములు...''

''కాదంబరీ! ఇలా జరుగుతుందని నేనెప్పుడూ అనుకోలేదు. నీకు జరిగిన అన్యాయానికి నేనూ బాధ్యుణ్ణే!...నీకు... నామీద కోపం లేదూ? ..''

''లేదు. నాకెందుకూ కోపం? మీరేం చేశారనీ! అంతా భానుమతే చేసింది. మేం ఒకప్పుడు పోట్లాడుకొన్నాం! అందుకని నానుంచి మిమ్మల్ని కాజేస్తుందనుకోలేదు పోసింది! అదంతా ఇప్పుడెందుకూ? .. చూడండి! ఆ వెన్నెల ఎంత బావుందో మత్తు కలిగించటం లేదూ? ''

సత్తిరాజు ఆమె ధోరణికి ఉక్కిరిబిక్కిరయ్యాడు. అతని కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయి. ఆమె దగ్గరగా నడిచాడు.

''కాదంబరీ! అలా మాట్లాడకు. ప్లీజ్! నీకు న్యాయంకాదు నీకు అన్యాయం జరిగింది. అందులో నాకు భాగముంది. వప్పుకొంటాను నువ్విక్కడ ఉండొద్దు నాతో వచ్చెయ్! ఎక్కడయినా ఓ ఉద్యోగం ఇప్పిస్తాను! గౌరవంగా బ్రతకొచ్చు ''

అతని చెంప ఛెళ్ళుమంది.

''పిచ్చిగా మాట్లాడకు! ఆడది ఓసారే మోసపోతుంది ''

వెక్కి వెక్కి ఏడవసాగిందామె.

మరికొద్ది క్షణాల్లోనే సత్తిరాజు కారు ఆ బంగళాలోనుంచి బయటకు దూసుకుపోయింది. కాదంబరి పిచ్చిదానిలా ఆ చీకట్లో అనాధ శరణాలయంవేపు నడిచింది.